జిన్నారం ఎంపీపీ అవిశ్వాసం పై హైకోర్టు స్టే

జిన్నారం, ఫిబ్రవరి 23: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల పరిషత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించింది. బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీటీసీలు ఎంపీపీ రవీందర్‌గౌడ్(కాంగ్రెస్)పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఈ నెల 2న ఆర్డీవోకు నోటీసు ఇచ్చారు. దీంతో ఈ నెల 26 ప్రత్యేక సమావేశం నిర్వహణకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు. అవిశ్వాసంపై ఎంపీపీ హైకోర్టును ఆశ్రయించగా.. ఈనెల 16నే స్టే ఆర్డర్ ఇచ్చినట్లు తెలుస్తున్నది.



ఓఆర్ఆర్ రెయిలింగ్‌ను ఢీకొన్న లాస్యనందిత కారు



ఉలిక్కిపాటు

ఓఆర్ఆర్‌పై కారు ప్రమాదంతో అలజడి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే మృతితో దిగ్భ్రాంతి

- హుటాహుటిన పటాన్‌చెరుకు చేరుకున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
- సంతాపం తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 23: పటాన్‌చెరు పట్టణ శివార్లలో ఔటర్ రింగ్‌రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మృతి చెందడంతో పారిశ్రామికవాడ ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసి మూడు నెలలు కాకుండానే ఆమె మృతిచెందడాన్ని బీఆర్‌ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. విషయం తెలియగానే మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ అగ్రనేత హరీశ్‌రావు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులను అలర్ట్ చేసి, హుటాహుటిన పటాన్‌చెరుకు చేరుకున్నారు. అప్పటికే పటాన్‌చెరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి లాస్యనందిత మృతదేహాన్ని తరలించారు. భారతీనగర్ కార్పొరేటర్ సింధుఆదర్శరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, ఆదర్శరెడ్డి, యాదగిరియాదవ్, విజయ్‌కుమార్, గూడెం విక్రంరెడ్డి తదితరులు ఆసుపత్రికి చేరుకున్నారు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని ఎమ్మెల్యే మృతదేహాన్ని చూసి కుప్పకూలగా హరీశ్‌రావు వారిని ఓదార్చారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించేందుకు ఎమ్మెల్యే మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు ఘటనా స్థలానికి కూడా పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ నాయకులు, అభిమానులు చేరుకున్నారు. ప్రమాద స్థలంలో క్లూస్‌టీం ఆధారాలను సేకరించారు. ప్రమాద స్థలం నుంచి ధ్వంసమైన కారును ముత్తంగి ఔటర్ రింగురోడ్డు జంక్షన్ వద్దకు తరలించారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నేతల సంతాపం

ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంపై ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలిగించాలని ప్రార్థించారు. అలాగే, మాజీ శాసనమండలి స్పీకర్ వి.భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధు ఆదర్శరెడ్డి, మెట్టుకుమార్‌యాదవ్, పుష్పనగేష్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సపానాదేవ్, శంకర్‌యాదవ్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రాజు, గూడెం మధుసూధన్‌రెడ్డి, కొలన్‌బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు పాండురంగారెడ్డి, కొలన్‌రోజారెడ్డి, లలితసోమిరెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్‌రెడ్డి, సుప్రజవెంకట్‌రెడ్డి, కుమార్‌గౌడ్, ఎంపీపీలు ప్రవీణభాస్కర్‌రెడ్డి, సుష్మవేణుగోపాల్‌రెడ్డి, ఈర్లదేవానంద్ తదితరులు నివాళులర్పించారు.



ప్రమాద తీవ్రతకు పగిలిపోయిన కారులోని బెలూన్లు, రక్తసిక్తమైన కారు లోపలి భాగం

బిల్లులకు నాదీ భరోసా

- కాంట్రాక్టర్లు అభివృద్ధికి సహకరించాలి
- వసతుల కల్పనకు అధికారులు కృషిచేయాలి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జహీరాబాద్, ఫిబ్రవరి 23: అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులకు తనదే గ్యారెంటీ అని, చేపట్టి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పిస్తానని మంత్రి దామోదర్ రాజనర్సింహ భరోసా ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. జహీరాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధిపై కలెక్టర్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలు, మౌలిక వసతులపై ఆరా తీశారు. పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఐడీఎస్ఎంటీ కాలనీలో వెయ్యి ప్లాట్లకు సంబంధించిన సమస్య అపరిష్కృతంగా ఉందని, తాగునీటి సమస్య కూడా వేదిస్తున్నదని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సమీకృత మార్కెట్‌ను నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.4.50 కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారు వివరించారు. సమీకృత మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకువస్తే మున్సిపాలిటీకి ఆదాయం పెరుగుతుందని, పట్టణాభివృద్ధికి నిధులు సమకూరుతాయని మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమీకృత మార్కెట్ భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్ జావిద్‌తో మాట్లాడారు. పెండిగ్ బిల్లును ఇప్పించే బాధ్యత తనదేనని, మార్కెట్ భవనం తాళాలు వెంటనే ఇవ్వాలని కోరారు. మంత్రి హామీతో కాంట్రాక్టర్ సమీకృత మార్కెట్ భవనం తాళాలను మంత్రి, కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి రూ. 12 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున పనులు ముందుకుసాగడం లేదని ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ నర్సింహులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందిస్తూ బిల్లును వెంటనే ఇప్పిస్తానని, మే నెల లోగా బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పన్ను వసూళ్లపై దృష్టిపెట్టండి

పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాలంటే పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని మున్సిపల్ సిబ్బందిని మంత్రి ఆదేశించారు. సమీకృత మార్కెట్ భవనం, దుకాణాల ద్వారా వచ్చే ఆదాయంతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను దామోదర్ ఆదేశించారు. రాయికోడ్ మండలం ఇటికేపల్లి నుంచి సింగూర్ జలాలను జహీరాబాద్‌కు తెప్పించేందుకు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీపై సమీక్షిస్తూ.. లబ్ధిదారుల్లో అనర్హులుంటే ఇళ్లను స్వాధీనం చేసుకుని అర్హులకు అందజేసేలా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో డయాలసిస్ వార్డు ఏర్పాటుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.



జహీరాబాద్ మున్సిపాలిటీ సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్



బర్దీపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర

ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం

జహీరాబాద్/ఝరాసంగం : ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. బర్దీపూర్ గ్రామంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బర్దీర్‌పూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటుతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సర్కారు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని బర్దీపూర్, ఎల్గోయి గ్రామాలకు చెందిన నిమ్జ్ భూబాధితులు మంత్రికి విన్నవించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాజు, మాజీ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, జడ్పీటీసీ వినీలా నరేష్, ఎంపీపీ దేవదాస్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హన్మంతరావుపాటిల్, అవధూతగిరి మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి.. నెలాఖరు లోగా సీఎంఆర్ పూర్తిచేయండి

- రైస్ మిల్లర్లకు మెదక్ కలెక్టర్ రాజర్షిషా వార్నింగ్

మెదక్, ఫిబ్రవరి 23: ప్రభుత్వం నిర్దేశించిన గడువు ఈ నెల 29తో ముగుస్తున్నందున నిర్లక్ష్యం చేయకుండా సీఎంఆర్ బకాయిలను జమ చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా రైస్‌మిల్లర్లను ఆదేశించారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సి ఉన్న రైస్‌మిల్లుల యజమానులతో శుక్రవారం ఆయన కలెక్టర్‌లో సమావేశమయ్యారు. సీఎంఆర్ బియ్యం అందజేయని యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, రెవెన్యూ రికవరీ యాక్టు ప్రయోగించి ఆస్తులను జప్తుచేస్తామని హెచ్చరించారు. నెలలు గడుస్తున్నా మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా పరగణిస్తామని పేర్కొన్నారు. ఈ నెలాఖరు లోగా నిర్దేశిత కోటాకు అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్వో బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

- పంచాయతీ కార్యదర్శులకు డీఎల్‌పీవో అనిత ఆదేశం

హత్నూర, ఫిబ్రవరి 23: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీవో అనిత గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలో శుక్రవారం ఆమె గ్రామకార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమావేశమై గ్రామాల్లో పాలన కొనసాగుతున్న తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వందశాతం పన్ను వసూలుకు కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను కొనసాగించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాలని సూచించారు. డంపుయార్డులు, నర్సరీల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీవో సువర్ణ, అధికారులు పాల్గొన్నారు.



జన జాతర

కోహెడ మండలం తంగళ్లపల్లి సమ్మక్క గద్దెల వద్ద కిక్కిరిసిన జనం

సిద్దిపేట జిల్లాలో పలు గ్రామాల్లో జరుగుతున్న సమక్క, సారలమ్మ జాతరలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఒడి బియ్యంతో పాటు నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. ఆలయాల సమీపాల్లో గుడారాలు వేసుకుని విడిది చేశారు. తమ కోర్కెలు నెరవేరాలని అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకుని సహపంక్తి భోజనాలు చేశారు. కొన్ని ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



కొమురవెల్లిలో సమ్మక్కను దర్శించుకుంటున్న భక్తులు



దూళిమిట్ట మండలం కూటిగల్ జాతరలో వెలసిన దుకాణాలు





బస్టాండ్ పార్కింగ్‌కు.. ప్రయాణికులు ఎండకు

గుమ్మడిదల కానుకుంట చౌరస్తాలోని ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల క్రితం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. బస్టాండ్ ప్రాంగణంలోకి ఆర్టీసీ బస్సులు రాకుండా మెదక్ హైదరాబాద్ జాతీయ రహదారిపైనే ఎక్కించుకోవడం, దించడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులకు రోడ్డుపైనే ఎండకు నిలబడి ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ప్రయాణ ప్రాంగణం వాహనదారుల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. - గుమ్మడిదల, (ఆంధ్రజ్యోతి)ఫిబ్రవరి 23


తల్లుల ప్రసాదం కోసం ఎగబడుతున్న భక్తులు


తల్లుల దర్శనం కోసం క్యూ లైన్లలో బారులుదీరిన భక్తులు


తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ క్యూ లైన్లలో జనం


తిరుగుపయనమైన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్లు, భక్తులను తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు


మొక్కులు సమర్పించేందుకు వచ్చిన భక్తులతో కిక్కిరిసి పోయిన గద్దెల ప్రాంగణం

భక్త జన హోరు..



▸▸ వనదేవతల రాకతో పోటెత్తిన భక్తులు ▸▸ నిరంతరాయంగా దర్శనాలు ▸▸ మొక్కులు చెల్లించుకున్న సీఎం, గవర్నర్

మేడారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం కూడా భక్తులు జోరుగా మొక్కులు సమర్పించుకున్నారు. తల్లుల దర్శనాలు నిరంతరాయంగా కొనసాగుతుండగా తరలివస్తున్న భక్తులతో గద్దెల ప్రాంగణం పోటెత్తుతోంది. క్యూలైన్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వీఐపీ ప్రవేశ ద్వారాల వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వేచిచూస్తుండడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మరింత జోరందుకుంది.

ప్రముఖుల తాకిడి

జాతరలో శుక్రవారం వీఐపీల తాకిడి పెరిగింది. ప్రముఖులంతా ఈ రోజే రావడంతో అధికారులపై ఒత్తిడి కనిపించింది. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్కను దర్శించుకొని మొక్కులను సమర్పించుకున్నారు. ఉదయం గవర్నర్‌తోపాటు కేంద్రమంత్రి ప్రత్యేక హెలికాప్టర్‌లో గద్దెల వద్దకు చేరుకున్నారు. ఎత్తుబంగారాన్ని తల్లులకు సమర్పించారు. పసుపు, కుంకుమ, గాజులు చీరెలను సమర్పించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి



హెలికాప్టర్‌లో మేడారం చేరుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ, శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎస్ఎస్‌వీ రెడ్డి, పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వ సీఎం శాంతికుమారి తదితరులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకుముందు మంత్రి సీతక్క సీఎంకు స్వాగతం పలకగా అధికారులు ఆలయ మర్యాదలతో గద్దెల వద్దకు తోడ్కొని వెళ్లారు. అలాగే రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు తల్లులను దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నేడు వన ప్రవేశం.. ముగియనున్న జాతర

గద్దెలపై కొలువుదీరి భక్తులకు ఆశీస్సులందిస్తున్న వనదేవతలు శనివారం వనప్రవేశం చేయనున్నారు. దీంతో నాలుగు రోజుల పాటు వైభవంగా జరిగిన సమ్మక్క సారలమ్మ మహాజాతరకు తెరపడనుంది. శనివారం సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు మిగతా పూజారులు సమ్మక్క గద్దె వద్దకు చేరుకొని చివరి పూజలు చేసి.. తల్లి రూపాన్ని తీసుకొని చిలకలగుట్టపైకి తీసుకువెళ్లి నిజస్థానంలో ఉంచి వెనుదిరుగుతారు.

దోవూరులో బాసర త్రిపుల్ ఐటీ విద్యార్థిని అంత్యక్రియలు

- శిరీష ఆత్మహత్యతో గ్రామంలో విషాదఛాయలు
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


శిరీష(ఫైల్)

దోవూరులో శిరీష అంత్యక్రియల్లో బంధువులు

మనూరు, ఫిబ్రవరి 23 : నిర్మల్ జిల్లా బాసరలోని త్రిపుల్‌ఐటీలో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని శిరీష అంత్యక్రియలను శుక్రవారం సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని స్వగ్రామమైన దోవూరులో నిర్వహించారు. తెనుగు శిరీష(17) బాసర త్రిపుల్‌ఐటీలో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతోంది. శిరీష మండల కేంద్రమైన మనూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుని త్రిపుల్‌ఐటీలో సీటును సాధించింది. ఆమెను గురువారం ఉదయమే తండ్రి నర్సింలు దోవూరు నుంచి బాసరకు వెళ్లి త్రిపుల్‌ఐటీ కళాశాలలో వదిలి వచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు. సాయంత్రం శిరీష సహచర విద్యార్థినులు స్టడీ అవర్‌లో చదువుకోవడానికి వెళ్లినప్పటికీ ఆమె గదిలోనే ఉండిపోయి, ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శిరీష మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్వగ్రామమైన దోవూరుకు తీసుకువచ్చి వారి సొంత వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు నిర్వహించారు. శిరీషకు తండ్రి నర్సింలు, తల్లి రుక్మిణి, సోదరుడు ఉన్నారు. కాగా శిరీష ఆత్మహత్య చేసుకోవడానికి ముందు సూసైడ్‌నోట్ రాసినట్లు గ్రామస్థులు తెలిపారు. సూసైడ్ నోట్‌లో అదే గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడని, అతడిని లెటర్‌లో బావగా పేర్కొంటూ, అతడు లేని జీవితం తనకు వ్యర్థమని, తాను ఆత్మహత్య చేసుకోవడం తప్పని తెలిసినప్పటికీ, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నానని అందులో పేర్కొందన్నారు. తల్లిదండ్రులను తనను క్షమించడమే కాకుండా తల్లిని, సోదరుడిని చక్కగా చూసుకోవాలని కూడా ఆ లెటర్‌లో సూచించినట్లు తెలిపారు. శిరీష చిన్నతనం నుంచి చదువులో చురుకుగా ఉండేదని, దీంతో ఆమె తల్లిదండ్రులు శిరీష పైచదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని భావించినప్పటికీ, ఆమె ఆత్మహత్య చేసుకోవడంతో వారు రోదించిన తీరు పలువురిని కంటతడిపెట్టించింది. తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. శిరీష మృతితో దోవూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలి

- డీఆర్డీవో ఎం.జ్యోతి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 23 : స్వయం సహాయక బృందంలోని ప్రతి మహిళా వ్యాపారవేత్తగా ఎదగాలని సంగారెడ్డి డీఆర్డీవో ఎం.జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె నారాయణఖేడ్ ఐకేపీ కార్యాలయాలన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్వయం సహాయక బృందాల మహిళలతో ముఖాముఖీ నిర్వహించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల ద్వారానే ఆర్థిక సాధికారిత సాధ్యమని, ప్రభుత్వం మహిళా సంఘాలను ప్రోత్సహిస్తుందన్నారు. అందువల్ల మహిళలు స్వయం సహాయక బృందాల ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసి, వాటిని మార్కెటింగ్ చేస్తూ వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. తాము మహిళల్లో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆమె జుక్కల్ శివారులోని మోడల్ మిల్లెట్‌ప్రాసెస్ యూనిట్‌ను సందర్శించి దానిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హన్మంత్‌రావుపేట శివారులోని నర్సరీని సందర్శించినప్పటికీ నర్సరీలో మొక్కలు సక్రమంగా లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. నర్సరీలో మొక్కలను పెంచడమే కాకుండా సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట నారాయణఖేడ్ ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం టిక్యా నాయక్, ఏపీవో మాణిక్‌రావు, సిబ్బంది ఉన్నారు. డీఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమెను ఐకేపీ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఆ భవనం మా హాస్టల్‌కే ఇవ్వాలి

- చేర్యాలలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనంలో ఎస్సీ వసతి గృహాన్ని కొనసాగించాలని కోరుతున్న విద్యార్థులు

చేర్యాల, ఫిబ్రవరి 23 : అనాలోచిత చర్యలతో చేర్యాల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. సొంత భవనం ఉన్నప్పటికీ ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఇతర భవనంలో ఆశ్రయం పొందుతూ నానా తంటాలుపడుతున్నారు. గతంలో చేర్యాల మండలం వరంగల్ జిల్లాలో కొనసాగిన సమయంలో పట్టణంలోని బీసీ బాలుర, రెండు ఎస్సీ విద్యార్థుల వసతి గృహాలను ఒకే గూటికి చేర్చేందుకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని నిర్మించారు. కానీ సకాలంలో అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఇదే క్రమంలో చేర్యాల మండలం సిద్దిపేట జిల్లాలో విలీనమైన సమయంలో సిద్దిపేటకు మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. సొంతభవనం లేక కొన్నాళ్లపాటు వేరే చోట్ల నిర్వహింపజేశారు. చివరికి చేర్యాలలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం నిరుపయోగంగా ఉండటంతో జనవరి 2017లో ఇందులోకి మార్చారు.

పాత హాస్టల్ భవన కూల్చివేతతో బీసీ హాస్టల్‌లోకి...

ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని గురుకుల కళాశాలకు అప్పగించడంతో చాన్నాళ్లు ఎస్సీ హాస్టల్ విద్యార్థులు పాడుబడిన భవనంలోనే తలదాచుకున్నారు. కానీ రూ.17కోట్లతో చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ భవన నిర్మాణంలో ఉన్న పాత హాస్టల్ భవనాన్ని కూల్చివేశారు. దీంతో పట్టణ శివారులోని బీసీ హాస్టల్ భవనంలోని మూడు గదులను కేటాయించారు.

మరో కళాశాలకు ఇచ్చే దిశగా..

ఆరేళ్లుగా గురుకుల డిగ్రీ కళాశాల భవనాన్ని వినియోగించుకున్న సంబంధిత అధికారులు ఎలాంటి షిఫ్టింగ్ ఆర్డర్స్ లేకున్నా అర్ధాంతరంగా తరలించారు. ప్రస్తుతం ఈ భవనంలో మరో మండలానికి చెందిన గురుకుల కళాశాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సొంత భవనం ఉన్నా సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు కేటాయించపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుతం సుమారు 55మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటున్న క్రమంలో తమ ఇంటిగ్రేటెడ్ భవనాన్ని తమకే కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు. స్వంత భవనంలో కొనసాగితే విద్యార్థుల సంఖ్య మరింతగా పెరగడంతో పాటు జూనియర్ కళాశాలగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. తద్వారా చేర్యాల ప్రాంత ఎస్సీ పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

ఎస్సీ హాస్టల్ విద్యార్థుల పట్ల వివక్ష



ఎస్సీ హాస్టల్ విద్యార్థుల పట్ల వివక్ష వహిస్తున్నారు. బీసీ హాస్టల్ భవనంలో చాన్నాళ్లుగా సతమతమవుతున్నా చిన్న చూపు చూస్తుండటం సబబు కాదు. ఇతర మండలాల కళాశాలలకు ఇస్తే స్థానిక విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ఎస్సీ ఇంటిగ్రేటెడ్ భవనంలో ఎస్సీ హాస్టల్‌నే నిర్వహించి కళాశాలగా తీర్చిదిద్దాలి. లేనియెడల ఆందోళనలు కొన సాగిస్తాం.

– దాసరి ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనాన్ని గురుకుల డిగ్రీకళాశాలకు అప్పగించడంతో ఎస్సీ హాస్టల్ విద్యార్థులు ఇబ్బం దులుపడుతున్నది వాస్తవమే. ప్రస్తుతం బీసీ హాస్టల్ భవనంలో ఉంటున్నారు. ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్‌ను ఎస్సీ హాస్టల్‌కు కేటాయింపచే యాలని ఇటీవలే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఇతర విభాగాలకు కేటాయించకుండా నావంతు కృషి చేస్తున్నాను.

– డీఎస్సీడీవో కవిత


చేర్యాలలోని ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్ భవనం


జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి తదితరులు

స్ట్రాంగ్‌రూంలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

జహీరాబాద్, ఫిబ్రవరి 23 : త్వరలో జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో స్ట్రాంగ్‌రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోల్ ఇన్‌చార్జీలు, సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అవసరమైన సిబ్బందిని ముందస్తుగానే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయంపూటే ఈవీఎంలను పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రాజు, డీపీవో మల్లేశం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జాతీయ సదస్సులు జ్ఞాన సముపార్జనకు సోపానాలు

- ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: జాతీయ సదస్సులు జ్ఞాన సముపార్జనకు సోపానాలని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. స్టేట్ వెల్ఫేర్ పాలసీస్ అండ్ సస్టేనెబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎంతో బాధ్యతాయుతంగా ఉంటూ జ్ఞానాన్వేషణకు కృషి చేయాలన్నారు. ఇలాంటి సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సదస్సులు విద్యార్థులకు, పరిశోధకులకు ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తాయన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మార్కుల కోసం పోటీ పడటం మానేసి టాలెంట్ కోసం చదవాలన్నారు. విద్యార్థులు త్రికరణశుద్ధిగా, గురువుకు అంకితభావంతో ఉంటూ విద్యనభ్యసించాలని సూచించారు. ప్రతిభకు మార్కులు కొలమానం కాదని, ప్రతిభ ఉంటే నేటి సమాజంలో మనుగడ ఉంటుందన్నారు. దేశంలో ప్రసుత్తం 21 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నారని, ప్రసుత్త పరిస్థితుల్లో స్వయం అభివృద్ధి చాలా సమస్యలకు పరిష్కారమని సూచించారు. ఆ దిశగా విద్యార్థుల ప్రయత్నం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.హుస్సేన్, వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, ప్రవీణ్‌కుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో రైతులు.. సమస్యలు పట్టని ప్రభుత్వాలు

- ప్రతీ రైతుకు రూ.5 లక్షల ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలి
- తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు డిమాండ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మెదక్‌లోని టీఎన్జీవో భవన్‌లో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంటల సాగు కోసం అవసరమయ్యే డబ్బు కోసం రైతులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సాగు పెట్టుబడుల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా వివిధ సాకులు చెబుతూ బ్యాంకులు మొండిచేయి చూపుతున్నాయని చెప్పారు. రైతుల సమస్యలను పాలకులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పంటకు లాభసాటి ధర, సాగు పెట్టుబడికి 3 రెట్లు తగ్గకుండా ఎమ్మెస్పీ ధరను నిర్ణయించాలని కోరారు. ఎలాంటి పంట నష్టం జరిగినా 30 రోజుల్లో రైతుకు నష్ట పరిహారం చెల్లించే విధంగా కేంద్రం ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులకు మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని, రైతు, కౌలు రైతులకు బ్యాంకుల నుంచి ఎలాంటి షరతులు లేకుండా రూ.5 లక్షల ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు ఏకగ్రీవ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. సమావేశంలో రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు యాదాగౌడ్, అక్కమొళ్ల షైనయ్య యాదవ్, శ్రీశైలం యాదవ్, వెంకటేశం, నర్సారెడ్డి, షేక్‌మదార్, నరేందర్, రాజు పాల్గొన్నారు.


రైతు తీర్మానాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీహరిరావు

తూముల మరమ్మతులు చేపట్టాలి

● సీపీఎం మండల కార్యదర్శి గౌరి

వెల్దుర్తి, ఫిబ్రవరి 23: యాసంగి సీజన్‌లో చెరువు, కుంటల తూములను మరమ్మతులు చేపట్టాలని సీపీఎం వెల్దుర్తి మండల కార్యదర్శి గౌరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మెదక్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నరేందర్‌తో కలిసి ఇరిగేషన్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెల్దుర్తి మండలంలోని చెరువులు, కుంటల తూముల మరమ్మతులు చేపట్టకపోవడంతో నీరు వృథాగా పోతున్నదని చెప్పారు. అయినా కూడా ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంట పొలాలకు నీరు అందించడంలో ఇరిగేషన్ అధికారులు రైతులకు సహకరించడం లేదని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, చెరువు, కుంటల తూముల మరమ్మతులను వెంటనే చేయించాలని వారు డిమాండ్ చేశారు. వారివెంట సీపీఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో సమస్యలు రానివ్వొద్దు

● జోగిపేట ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్

జోగిపేట, ఫిబ్రవరి 23: వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకునే బాధ్యత ఏఈలు, సిబ్బందిదేనని జోగిపేట డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జోగిపేటలోని తన కార్యాలయంలో డివిజన్ స్థాయిలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డీఈ శ్రీనివాస్ మాట్లాడారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా మండల స్థాయిలో ఏఈలు, గ్రామస్థాయిలో ఇతర సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సరఫరాలో సమస్యలు తలెత్తితే సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి విద్యుత్ సరఫరాపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఈ శ్రీనివాస్, ఆయా మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


జోగిపేటలో మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్

జహీరాబాద్‌లో

జహీరాబాద్: పట్టణంలోని ఓ గార్డెన్‌లో డివిజన్‌స్థాయి విద్యుత్ ఉద్యోగులతో విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో కోతలు లేకుండా విద్యుత్ సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తమ పరిధిలో లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ మధుసూధన్, రజనీకాంత్, ఏఈలు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


జహీరాబాద్‌లో మాట్లాడుతున్న డీఈఈ లక్ష్మీనారాయణ

దొంగతనం కేసులో నిందితుల రిమాండ్


నిందితులను చూపుతున్న సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ శ్రీధర్

జోగిపేట, ఫిబ్రవరి 23: ట్రాక్టర్, ట్రాలీల దొంగతనం కేసులో నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జోగిపేటలో పుల్కల్ ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. పుల్కల్ మండలం శివంపేటకు చెందిన ఆలకుంట నరేశ్, నత్తి రాజీవ్, లేగల వికుమార్, వడ్డె శ్రీను, వడ్డె కుమార్, బండారి రవి ఒక జట్టుగా ఏర్పడి సులభ మార్గంలో డబ్బు సంపాదించేందుకు ట్రాక్టర్లను దొంగలించాలని నిర్ణయించుకున్నారు. పుల్కల్ మండలంలో ఒక ట్రాక్టర్, రెండు ట్రాలీలు, సంగారెడ్డి రూరల్ మండలం ఇరిగిపల్లిలో ఒక ట్రాలీ, జిన్నారం మండలం సోలక్‌పల్లిలో మరో ట్రాలీని దొంగలించి, పుల్కల్ మండలంలో దాచి ఉంచారు. వీటిని అమ్మాలని ప్రయత్నించినా సరైన పత్రాలు లేకపోవంతో ఎవరూ కొనలేదు. దీంతో పొరుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తికి అమ్మేందుకు గురువారం రాత్రి ట్రాక్టర్, ట్రాలీతో బయలుదేరారు. రాత్రి ముదిమానిక్యం క్రాస్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడడంతో ఎస్ఐ శ్రీధర్ పత్రాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ట్రాక్టర్, ట్రాలీతో సహా పారిపోయే ప్రయత్నం చేయగా.. ఎస్ఐ, తన సిబ్బంది వెంబడించి పట్టుకుని తమదైన శైలిలో విచారించగా దొంగతనం విషయం బయటపడింది. నిందితుల నుంచి ట్రాక్టర్, మూడు ట్రాలీలతో పాటు దొంగతనాలకు ఉపయోగించిన మరో ట్రాక్టర్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం నిందితులందరినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అనిల్ కుమార్ వివరించారు.

మెదక్ జిల్లాలో 68 కేంద్రాల్లో పది పరీక్షలు

● హాజరు కానున్న 10,300 మంది విద్యార్థులు

● సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: మార్చి 18న ప్రారంభమయ్యే పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం వివిధ శాఖల అధికారులతో మెదక్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 68 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలకు 10,300 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, విద్యుత్ కోతలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సప్లమెంటరీ రాసే 89 మంది విద్యార్థులకు మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కేంద్రం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రమేష్, అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి, ఏఎంవో సుదర్శనమూర్తి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● సీఎస్, డీవోల సమావేశాల్లో జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్), డిపార్ట్‌మెంట్ అధికారులు(డీవో)లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 6,507 మంది, ద్వితీయ సంవత్సరంలో 6,668 మంది, ఒకేషన్‌లో 1,165 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటల వరకు విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని ఇంటర్ బోర్డు స్పష్టం చేసిందన్నారు. సమావేశంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శశదర్, అశోక్, ఫ్లయింగ్‌స్క్వాడ్ నరేందర్, సీనియర్ ప్రిన్సిపాల్స్ రవీందర్, అవనిష్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సంగారెడ్డిలో

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ డిగ్రీ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి సీఎస్, డీవోలతో అడిషనల్ కలెక్టర్ మాధురి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇంటర్ పరీక్షలు నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్(డీవో)ల పాత్ర కీలకమన్నారు. ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే వెంటనే ఇంటర్ బోర్డు అధికారుల వద్దకు తీసుకురావాలని కోరారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, డీసీఈ మెంబర్లు శ్రీనివాస్, సుమలత, కమలాకర్, హెచ్‌పీసీ మెంబర్ ప్రభావతి, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.

నక్షబాటను ఆక్రమించిన పరిశ్రమ యాజమాన్యం

● చర్యలు తీసుకోవాలని తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు


తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న పల్పనూర్‌వాసులు

హత్నూర, ఫిబ్రవరి 23: హత్నూర మండల పరిధిలోని పల్పనూర్ గ్రామానికి వెళ్లే నక్షబాటను ఓ పరిశ్రమ యాజమాన్యం ఆక్రమించుకొని నిర్మాణం చేపడుతున్నదని గ్రామస్థులు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారి నుంచి పల్పనూరు గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన రోడ్డును వైష్ణవి మైండ్స్ అండ్ మినరల్స్ యాజమాన్యం ఆక్రమించుకొని ప్రహరీ నిర్మాణం చేపట్టిందని ఆరోపించారు. పరిశ్రమ ఆక్రమించుకున్న నక్ష రోడ్డును కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుల మల్లేశం, నాయకులు ఆంజనేయులు, మల్లేశం తదితరులు ఉన్నారు.

పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు వేయించాలి

● ఉమ్మడి జిల్లా కార్యనిర్వహణ అధికారి రాంజీ

నిజాంపేట, ఫిబ్రవరి 23: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా టీకాలు వేయించాలని ఉమ్మడి మెదక్ జిల్లా కార్యనిర్వహణ అధికారి రాంజీ అన్నారు. మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామంలో శుక్రవారం పశుగణాభివృద్ధి సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల గురించి తెలుసుకుని వాటి నివారణ కోసం టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ఈ వైద్య శిబిరంలో కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్స్, గర్భధారణ గుర్తించు పరీక్షలు, నట్టల నివారణ మాత్రలు, గొర్ల యూనిట్లకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సుధాకర్ దేశ్‌ముఖ్, గోపాలమిత్రలు స్వామి, సంతోష్, శ్రీకాంత్, శ్రీను, బాబు, వీపీ రాజు, కార్యదర్శి ప్రశాంత్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ సంజీవ్ పాల్గొన్నారు.


పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కూలీల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షను విడనాడాలి

● డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవ్ డిమాండ్

నిజాంపేట, ఫిబ్రవరి 23: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల పట్ల వివక్షను విడనాడాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుబాసి సంజీవ్ డిమాండ్ చేశారు. కూలీలపై కొత్త జీవోలను తీసుకువస్తూ హక్కులను హరించివేస్తుందని, పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని గత పది సంవత్సరాలుగా ఉల్లంఘిస్తూ కూలీలను ఉపాధి హామీ పనికి దూరం చేస్తున్నదని అన్నారు. మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో శుక్రవారం చింతలకుంట పూడికతీత పనులను చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుబాసి సంజీవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూలీల హక్కులను కాపాడేందుకు తోడ్పాటునందించాలని కోరారు. ఉపాధి హామీ కూలీల పరిరక్షణ కోసం రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులతో ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలతో సమీక్ష జరపాలని కోరారు. బీజేపీ హఠావో.. నరేగా బచావో.. నినాదంతో ముందుకు సాగాలని కూలీలకు సూచించారు. చట్ట ప్రకారం 15రోజుల్లోగా కూలీ డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు ఉన్నారు.


ఉపాధి హామీ కూలీల సమస్యలను తెలుసుకున్న సంజీవ్

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 23: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పీర్లతండాకు చెందిన వడిత్యా వెంకట్(31) మతిస్థిమితంతో బాధపడుతున్నాడు. ఈ నెల 21న వెంకట్‌ను అతడి తల్లి చాందిబాయి పశువులను మేపడానికి తీసుకెళ్లాలని చెప్పగా మొండికేయడంతో మందలించింది. దీంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన వెంకట్ తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద విచారించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం చాందిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


వెంకట్ (ఫైల్)

దోమడుగు గ్రామంలో

గుమ్మడిదల: దోమడుగు గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన ఖలీల్ భాష ఈ నెల 22న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ దొరకపోవడంతో భార్య సుగాల బేగం శుక్రవారం గుమ్మడిదల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.


ఖలీల్‌భాష (ఫైల్)

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి


బాలికల గురుకులంలో బెడ్లను అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

ఝరాసంగం, ఫిబ్రవరి 23: విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు 100 బెడ్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, నాయకులు పాండురంగారెడ్డి, పురుషోత్తం, విశ్వనాథ్, ఓంకార్, దుర్గయ్య, వేణుగోపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, రాజుస్వామి, శేఖర్‌రెడ్డి, సంజీవ్, శుభమ్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని టీచర్ సస్పెన్షన్

వెల్దుర్తి, ఫిబ్రవరి 23: సమయపాలన పాటించని మేల్లూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకట్‌రెడ్డి పాఠశాలకు సమయపాలన పాటించడం లేదని ఈ నెల 16న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు మండల విద్యాధికారి యాదగిరికి సమాచారమిచ్చారు. పాఠశాలను సందర్శించిన ఎంఈవో వెంకట్‌రెడ్డి సమయపాలన పాటించడం లేదని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో డీఈవో సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి మెదక్ జిల్లా కేంద్రంలో జరిగింది. మెదక్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ప్రయాణికులను బస్టాండ్‌లో వదిలి, చౌరస్తా మీదుగా పార్కింగ్ చేసేందుకు డిపోకు వెళ్తున్నది. ఈ క్రమంలో ఎదురుగా వెళ్తున్న డీసీఎం బస్సు వైపునకు రావడంతో తప్పించే క్రమంలో అదుపు తప్పి డివైడర్ పైకి వెళ్లింది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను మళ్లించారు. జేసీబీ సహాయంతో బస్సును గ్యారేజ్‌కు తరలించారు.



డివైడర్ ఎక్కిన బస్సు

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

తూప్రాన్, ఫిబ్రవరి 23: తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారిలో పడాలపల్లికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మట్టెల ఆంజనేయులుయాదవ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గండి మల్లేశ్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు లంబ లవకుమార్, లంబ వెంకటేశ్‌యాదవ్, వర్గంటి స్వామిగౌడ్ ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, పార్టీ నాయకులు చెలిమెల రఘుపతి, భగవాన్‌రెడ్డి, సిద్ధిరాములుగౌడ్, శశిభూషన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో భద్రత పెంచాలి

● బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిభాష

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 23: గుర్తుతెలియని దుండగులు చిన్న పిల్లలను ఎత్తుకుకెళ్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో భద్రత పెంచాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిభాష డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులను పాఠశాలల్లోకి అనుమతించవద్దని హితవు పలికారు. విద్యార్థులను వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఎక్కడికి పంపరాదని సూచించారు. అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎస్సీ ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కసిని మని, రవి, రాజశేఖర్, దుర్గేష్, శ్రీకాంత్, సాగర్, రాకేశ్ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాయిభాష

హోంగార్డు కుటుంబానికి రూ.2.50 లక్షల సహాయం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23: హోంగార్డు శ్రీనివాస్ కుటుంబానికి జిల్లా పోలీస్‌శాఖ అండగా నిలిచింది. జిల్లా పోలీస్‌శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహించిన శ్రీనివాస్ 2021లో జోగిపేట వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గతేడాది నవంబరులో శ్రీనివాస్ భార్య అన్నపూర్ణ, ఇద్దరు పిల్లలతో కలసి బైక్‌పై వెళ్తుండగా.. మెదక్ పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారులు పృథ్వీతేజ, ప్రణయ్‌తేజ మృతి చెందారు. అటుభర్త, ఇటు పిల్లలను కోల్పోయి ఒంటరి అయిన అన్నపూర్ణకు జిల్లా పోలీస్ సిబ్బంది అండగా నిలిచారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ బాలస్వామి అన్నపూర్ణకు రూ.2.50 లక్షల నగదును అందజేశారు.


శ్రీనివాస్ కుటుంబానికి రూ.2.50 లక్షలను అందజేస్తున్న ఎస్పీ బాలస్వామి

బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బంది పెట్టొద్దు

నర్సాపూర్, ఫిబ్రవరి 23: రైతులను పంట రుణాల విషయంలో బ్యాంకు అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని బ్యాంకు అధికారులను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కోరారు. శుక్రవారం నర్సాపూర్ ఎస్‌బీఐ మేనేజర్‌ను ఆంజనేయులుగౌడ్ కలిసి రైతులను పంట రుణాల విషయంలో రైతులు బకాయిల విషయంలో ఇబ్బంది పెట్టకుండా సంయమనంతో ఉండాలని కోరారు. త్వరలోనే ప్రభుత్వం రుణమాఫీ చేయనున్నందున సహకరించాలన్నారు. రైతుల ఖాతాలను నిలిపివేయకుండా కొనసాగించాలని కోరారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్‌గుప్తా, సురేష్‌నాయక్, అశోక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సంత్ గాడ్గే బాబా జీవితం స్ఫూర్తిదాయకం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 23: సంత్ గాడ్గే బాబా జీవితం స్ఫూర్తిదాయకమని ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ అన్నారు. శుక్రవారం ఖేడ్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంత్‌గాడ్గె బాబా 148వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్ షెట్కార్ మాట్లాడుతూ.. గ్రామాల శుభ్రత, జీవహింస, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, కుల మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని గాడ్గెబాబా చేసిన కృషి మరువలేదని కొనియాడారు. విద్య బలోపేతం కోసం ఆయన చేసిన కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోని ఆచరించాలన్నారు. అనంతరం నగేష్ షెట్కార్‌కు మహనీయుల చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు అంజాగౌడ్, అలిగే జీవన్‌కుమార్, భీంసేన, ఓంకార్, చందర్‌నాయక్, బక్షిరాం, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నీటి దందా

● కోహీర్ మండలంలో అక్రమంగా నీటిని సేకరించి, పరిశ్రమలకు తరలిస్తున్న వ్యాపారులు

● వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నా పట్టించుకోని అధికారులు


దిగ్వాల్‌లో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆర్వో ప్లాంట్‌ను నుంచి తరలించేందుకు ట్యాంకర్‌లో నీటిని నింపుతున్న దృశ్యం

కోహీర్, ఫిబ్రవరి 23: కోహీర్ మండలంలో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని దిగ్వాల్, కవేలి, వెంకటాపూర్ గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా నీటిని సేకరించి, ట్యాంకర్లతో అక్రమంగా మండలంలోని పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. వెంకటాపూర్, దిగ్వాల్, కవేలి గ్రామాల్లో పరిశ్రమల యజమానులు రైతులకు డబ్బులు చెల్లించి బోరుబావుల నుంచి నీటిని తోడేస్తున్నారు. దిగ్వాల్ గ్రామంలో రెండు ఆర్వో ప్లాంట్‌ల నుంచి స్థానికంగా ఉన్న రసాయన పరిశ్రమకు నీటిని తరలిస్తున్నారు. ఇది వాల్టా చట్టానికి విరుద్ధమైనా అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు. బోరుబావుల నుంచి నీటిని తోడేయడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా తగ్గిపోయి తాగునీరు దొరకని పరిస్థితి ఏర్పడే ప్రమాదముంది.

చర్యలు తీసుకుంటాం



అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఈ విషయంపై పరిశీలన చేసి, అక్రమంగా నీటి రవాణా జరిగినట్లు తేలితే రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

\- బాలశంకర్, తహసీల్దార్, కోహీర్

రాయికోడ్ ఏడీఏగా సత్యనారాయణ



రాయికోడ్, ఫిబ్రవరి 23: రాయికోడ్ సహాయ వ్యవసాయ సంచాలకుడిగా డి.సత్యనారాయణ శుక్రవారం మండల కేంద్రంలోని ఏడీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన హరిత హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఇబ్రహీంపట్నం నుంచి బదిలీపై వచ్చిన డి.సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణను మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏవో అవినాష్‌వర్మ, ఏఈవో తదితరులు పాల్గొన్నారు.